


మహర్షి భగీరథకు ఘన నివాళులు

నరసరావుపేట: మహర్షి భగీరథ జయంతి సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ మహర్షి భగీరథ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో గురువారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.1,800, గరిష్ట ధర రూ.3,600, మోడల్ ధర రూ.2,400 వరకు పలికింది.

కరోనా జీరో



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా గురువారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.

న్యూస్‌రీల్

యార్డుకు 1,27,131 బస్తాల మిర్చి రాక



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 1,27,131 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 1,24,759 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.22,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.24,000 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.13,000 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 82,934 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

బాపట్ల జిల్లాలో ఇద్దరు డీఎస్పీలు బదిలీ

బాపట్లటౌన్: బాపట్ల డీఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న ఎ.శ్రీనివాసరావును ఆత్మకూరు డీఎస్పీగా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అదేవిధంగా చీరాల డీఎస్పీగా ఉన్న పి.శ్రీకాంత్‌కు గుడివాడ డీఎస్పీగా బదిలీ చేశారు. అనంతపురం డీటీసీ డీఎస్పీగా ఉన్న ఎస్. ప్రసాదరావును చీరాల డీఎస్పీగా నియమించారు. త్వరలో ఎస్.ప్రసాదరావు బాధ్యతలు స్వీకరించనున్నారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 522.40 అడుగుల వద్ద ఉంది. ఇది 153.6890 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 1,800 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 1,800 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 1,800 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 804.90 అడుగుల వద్ద ఉంది. ఇది 31.4843 టీఎంసీలకు సమానం.

1 నుంచి పాఠశాలలకు వేసవి సెలవులు

జూన్ 12న పాఠశాలలు పునః ప్రారంభం

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లాలో అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలలు ఈనెల 30వ తేదీన విద్యాసంవత్సరపు చివరి పనిదినంగా పాటించాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ తెలిపారు. ఆమె గురువారం మాట్లాడుతూ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఆదేశానుసారం 2022-23 విద్యాసంవత్సరం ఈనెల 30న ముగియనుండగా, విద్యార్థులకు మే ఒకటో తేదీ నుంచి జూన్ 11 వరకు వేసవి సెలవులను ప్రకటించినట్లు చెప్పారు. మరలా నూతన విద్యాసంవత్సరం జూన్ 12న ప్రారంభమవుతుందని, ప్రభుత్వ ఆదేశాలను తు.చ. తప్పకుండా పాటించి విద్యార్థులకు వేసవి సెలవులను ప్రకటించాలని యాజమాన్యాలను ఆదేశించారు. ఈ విషయమై క్షేత్రస్థాయిలో తగు చర్యలు చేపట్టాలని డీవైఈఓ, ఎంఈఓలను డీఈఓ పి.శైలజ ఆదేశించారు.

నేడు హెచ్‌సీఎల్ టెక్‌బీ ప్రోగ్రాం ఎంపికలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ), హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ సంయుక్త ఆధ్వర్యంలో హెచ్‌సీఎల్ టెక్‌బీ ప్రోగ్రాం ఎంపికలను శుక్రవారం ఉదయం 9.30 గంటలకు నల్లపాడులోని ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి. ప్రణయ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐటీ రంగంలో కెరీర్‌ను ప్రారంభించేందుకు నిర్వహిస్తున్న హెచ్‌సీఎల్ ఎర్లీ ట్రెనింగ్ ప్రోగ్రాం క్యాంపస్ డ్రైవ్‌కు 2022, 2023 సంవత్సరాల్లో ఇంటర్‌లో మ్యాథ్స్, బిజినెస్ మ్యాథ్స్‌లో 60 శాతం కంటే ఎక్కువ మార్కులతో ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులని తెలిపారు. బయోడేటా, రెజ్యూమ్, విద్యార్హతల సర్టిఫికెట్లు, ఆధార్ జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో నేరుగా ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు. వివరాలకు తమ ప్రతినిధులు రవి కుమార్ (63042 92828), అనిల్ (85550 85030) ను సంప్రదించాలని సూచించారు.

మూడు గ్రూపులు.. ఆరు తగవులు

చంద్రబాబు టూర్ అట్టర్ ఫ్లాప్..

- కొనసాగిన మూడు ముక్కలాట
- ఎవరికీ సీట్ ఖరారు చేయని వైనం
- గ్రూపులకు చెక్ పెట్టలేక పోయారు
- సత్తెనపల్లి సభలో కన్నాకు అవమానం
- చంద్రబాబు వాహనంపై కోడెల శివరాంకి మాత్రమే అవకాశం
- అమరావతి సభ ఆగిపోవడంపై చంద్రబాబు ఆగ్రహం
- సత్తెనపల్లి, మేడికొండూరు సభలకు బయట నియోజకవర్గాల నుంచి జనం
- ఫ్లెక్సీలు తొలగించారంటూ తెలుగుదేశం నేతల ఫిర్యాదు



చింపేసిన ఫ్లెక్సీ

సాక్షి ప్రతినిధి, గుంటూరు: ఉమ్మడి గుంటూరు జిల్లాలో మూడు రోజులపాటు జరిగిన తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు పర్యటన మూడు గ్రూపులు, ఆరు తగవు లుగా సాగింది. ఆయా నియోజక వర్గాల తెలుగుదేశం పార్టీలో ఉన్న గ్రూపులను అదుపు చేయడంలో చంద్రబాబు నాయుడు విఫలమయ్యారు..

తీవ్రస్థాయిలో విభేదాలు..

తొలి రోజున అమరావతిలో జరిగిన సభ ఫ్లాప్ కావడంతో చంద్రబాబు నాయుడు నాయకులకు క్లాస్ తీసుకున్నారు. దీంతో చివరి రెండు రోజులు బయట నియోజకవర్గాల నుంచి జన సమీకరణ చేశారు. తాడికొండ నియోజకవర్గం మేడికొండూరు సభకు గుంటూరు నుంచి జనాన్ని పెద్దఎత్తున తరలించాలని అర్బన్ నాయకులకు ఆదేశాలు అందాయి. మూడురోజుల పర్యటనలో మూడు నియోజకవర్గాల్లోనూ పార్టీకి సంబంధించిన నాయకుల మధ్య విభేదాలు తీవ్రస్థాయిలో కొనసాగాయి. అమరావతిలో మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్‌ని అభ్యర్థిగా ప్రకటించడానికి చంద్రబాబు నాయుడు నిరాకరించారు.

ఫ్లెక్సీల తొలగింపులో వీధికెక్కిన రగడ...

తాడికొండలో తెనాలి శ్రావణ్‌కుమార్‌కు మిగిలిన వర్గాలకు మధ్య విభేదాలు తారాస్థాయికి చేరాయి. మేడికొండూరు సభకు సంబంధించి మిగిలిన నాయకులు కట్టిన ఫ్లెక్సీలను శ్రావణ్ కుమార్ వర్గం తొలగించింది. మేడికొండూరు మండలంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమానికి చంద్రబాబు నాయుడు వస్తున్న సందర్భంగా తాడికొండ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు తోకల రాజవర్ధన్, కంభంపాటి శిరీష, గుంటూరు నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్ తదితరులు పేరేచర్ల సెంటర్ నుంచి కొరప్రాడు గ్రామం వరకు చంద్రబాబు నాయుడికి స్వాగతం పలుకుతూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తెనాలి శ్రావణ్ కుమార్ వర్గీయులు దౌర్జన్యంగా చింపేసి, ఫ్లెక్సీలు కడుతున్న యువకులపై దౌర్జన్యం చేశారు. దీంతో శిరీషకి శ్రావణ్ కుమార్ వర్గీయులకు మధ్య వాగ్వివాదం జరిగింది. ఒకదశలో శిరీష వర్గీయులు రోడ్డుపై బైఠాయించే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. తోకల రాజవర్ధన్ పీఏ సాయి నరేష్ మేడికొండూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాయపాటి సాంబశివరావు వర్గానికి చెందిన తోకల రాజవర్ధన్ ఇటీవల చంద్రబాబునాయుడిని కలవడం ఆయన్ను పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనమని చెప్పడంపై తెనాలి శ్రావణ్‌కుమార్ వర్గం గుర్రుగా ఉంది. ఈనేపథ్యంలో తనవి తప్ప వేరే ఎవరివి ఫ్లెక్సీలు ఉండకూడదని శ్రావణ్ భావించినట్లు తెలుగు తమ్ముళ్లు చెబుతున్నారు.

కన్నాకు ఘోర అవమానంపై విస్తృత చర్చ...

సత్తెనపల్లి నియోజకవర్గ పరిధిలో జరిగిన చంద్రబాబు నాయుడు పర్యటనలో ఇటీవల టీడీపీలో చేరిన మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణకు ఘోర అవమానం జరిగింది. టీడీపీలో చేరిన తర్వాత గత కొంతకాలంగా సత్తెనపల్లి నియోజకవర్గంపై ఆయన దృష్టి సారించి, అక్కడ ఆఫీస్, ఇల్లు తీసుకుని రాజకీయం చేస్తున్నారు. అయితే కన్నాను బాబు కనీసం ప్రచార రథంపైకి ఎక్కనీయలేదు. బాబు పర్యటనలో కన్నాకు సముచిత స్థానం లభించకపోవడంతో ఆయన అనుచరులు తీవ్రస్థాయిలో రగిలిపోతున్నారు. ప్రచార రథం పైకి సత్తెనపల్లిలో గ్రూపులుగా ఏర్పడి విభేదాలతో పార్టీలో పనిచేస్తున్న అందరి నేతలకి అవకాశం దక్కినా.. సీనియర్ నాయకుడు కన్నాకు బాబుతో కలిసి నిలబడే అవకాశం రాలేదు. సభ సమయంలో కోడెల శివరాం ఒక్కడినే పక్కన ఉంచుకోవడాన్ని కన్నా, ఆయన వర్గీయులు జీర్ణించుకోవడం లేదు. బాబు కేవలం తన సామాజిక వర్గం నేతలకు మాత్రమే ప్రాధాన్యత ఇచ్చారని వారు అంటున్నారు. చంద్రబాబు పర్యటనలో కన్నాకు జరిగిన అవమానం ఆ పార్టీలోనే తీవ్రస్థాయి చర్చకు దారి తీసింది.



యడ్లపాడు మండలం కొత్తపాలెం గ్రామంలోని బొల్లుమోర వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక వేడుకల్లో పాల్గొని మాట్లాడుతున్న మంత్రి విడదల రజిని - యడ్లపాడు

సంక్షేమాన్ని దళితుల దరి చేర్చిన సీఎం జగన్

- స్వాతంత్ర్యం వచ్చాక ఎవరూ చేయని మంచి పనులు చేశారు
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డొక్కా మాణిక్యవరప్రసాద్

పట్నంబజారు: స్వాతంత్ర్యం వచ్చిన తరువాత రాష్ట్ర రాజకీయ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా దళితులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేలు చేశారని.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ స్పష్టం చేశారు. నాలుగేళ్ల కాలంలో రూ.55వేల కోట్ల మంచి చేస్తూ.. సంక్షేమాన్ని దళితుల దరి చేర్చిన గొప్ప వ్యక్తి సీఎం జగన్ అని చెప్పారు. బృందావన్‌గార్డెన్స్‌లోని వైఎస్సార్ సీపీ ప్రాంతీయ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ఎన్నడూ లేనివిధంగా ఐదు మంత్రి పదవులు, ఒక ఉప ముఖ్యమంత్రి, ఆరుగురు ఎమ్మెల్సీలు, 28 మంది ఎమ్మెల్యేలుగా దళితులకు అవకాశం కల్పించింది సీఎం జగన్ మాత్రమే అన్న విషయాన్ని ప్రతిపక్ష నేత చంద్రబాబు గుర్తించాలన్నారు. దళితులకు మేలు చేసే విషయంలో బహిరంగ చర్చకు సిద్ధమని ప్రకటించిన చంద్రబాబు.. అక్కడకు వచ్చి ఏం మాట్లాడగలరని ప్రశ్నించారు. తన హయాంలో దళితులకు జరిగిన అన్యాయం, సీఎం జగన్ నేతృత్వంలో జరిగిన మంచిని తప్ప ఏం మాట్లాడలేరని తేల్చిచెప్పారు. దళిత జాతికి చెందిన మేకతోటి సుచరితకు, ఇప్పుడు తానేటి వనితకు హోం మంత్రి స్థానం కల్పించిన ఘనత సీఎం జగన్‌ది అయితే.. ఏదో ఇవ్వాలన్న చందంగా కేవలం రెండు శాఖలు మాత్రమే దళితులకు కేటాయించిన నీఛ బుద్ధి చంద్రబాబుదని మండిపడ్డారు. కార్పొరేషన్‌లకు సంబంధించి ఎస్సీ,ఎస్టీ వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించి..తాను దళిత పక్షపాతినని సీఎం జగన్ చాటిచెప్పారన్నారు. 30లక్షలకు మందికిపైగా ఇంటి స్థలాలు అందజేసిన సీఎం జగన్ ఒక విప్లవాన్ని సృష్టించారన్నారు. దళితుల్లో పుట్టాలని ఎవరు కోరుకుంటారని వ్యాఖ్యలు చేసిన చంద్రబాబు.. దళితులకు మేలు చేస్తాడంటే నమ్మే పరిస్థితుల్లో ఎవరూ లేరన్నారు. చంద్రబాబు కేవలం రాజకీయ స్వలాభం కోసమే తప్ప.. దళితులపై ఏ మాత్రం ప్రేమ లేదన్న విషయం అందరికీ తెలుసన్నారు.

సీఎం జగన్ నేతృత్వంలోనే రాజకీయ ప్రయాణం..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నేతృత్వంలోనే తన రాజకీయ ప్రయాణం కొనసాగుతుందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ స్పష్టం చేశారు. పలువురు మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. పదవులు లేకపోయినా.. తాను సీఎం జగన్ వెంటే నడుస్తానన్నారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు, కార్పొరేటర్‌లు అంబేడ్కర్, వంశీ, పార్టీ నేతలు గనిక ఝాన్సీ, పూనూరి నాగేశ్వరరావు, పెరికల కృష్ణమోహన్, అత్తోట జోసఫ్ పాల్గొన్నారు.

పేదింటికి 'అమృత్' ధార

టిడ్కో ఇళ్లకు అందుబాటులో తాగునీరు

- గుంటూరు కార్పొరేషన్ పరిధిలో 4192 ఇళ్లు పూర్తి
- రూ. 219.9 కోట్లతో నిర్మాణ పనులు. 98 శాతం పనులు పూర్తి
- రూ.11 కోట్లతో అమృత్ పథకం మంచినీటి సరఫరా
- రూ.15.07 కోట్లతో మౌలిక సదుపాయాలు పూర్తి
- రూ.14.80 కోట్లతో విద్యుద్ధీకరణ పనులు
- రూ.కోటితో పార్క్ అభివృద్ధి
- జూన్‌లో ప్రారంభోత్సవాలకు సర్వం సిద్ధం



అడవి తక్కెళ్లపాడులో నిర్మించిన టిడ్కో గృహాలు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: అడవి తక్కెళ్లపాడులో నిర్మిస్తున్న టిడ్కో ఇళ్లకు సంబంధించిన అన్ని అడ్డంకులు తొలగిపోయాయి. దీంతో జూన్ నెలలో 4192 ఇళ్ల ప్రారంభోత్సవాలకు లైన్ క్లియర్ అయింది. గుంటూరు అర్బన్ పరిధిలోని ప్రజల కోసం తక్కెళ్లపాడులో 4192 ఇళ్లను రూ.219.6 కోట్లతో నిర్మించారు. ఈ పనులు 98 శాతం పూర్తి అయ్యాయి. అయితే వీటికి మౌలిక సదుపాయాలు కల్పించడం ఒక సమస్యగా మారింది. ఈ ప్రాజెక్టుకు మంచినీటి సదుపాయం లేకపోవడంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వచ్చిన తర్వాత పలు చర్యలు చేపట్టింది.

వేగవంతంగా పనులు పూర్తి..

అమృత్-1, ఫేజ్-2లో తక్కెళ్లపాడు హెడ్‌వాటర్ వర్క్స్ నుంచి గోరంట్ల కొండపైకి 800 ఎంఎం డయా పైప్‌లైన్, బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణ పనులు చేపట్టారు. 2017లో పనులు ప్రారంభమైనా ప్రభుత్వ అనుమతులు లేకపోవడం, స్థల సేకరణ సమస్యతో ముందుకు వెళ్లలేదు. ఇప్పుడు నగరపాలక సంస్థ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపించి రైల్వే అధికారులను కలిసి గడ్డిపాడు ఆటోనగర్ రైల్వే క్రాసింగ్ పైప్‌లైన్‌ను అనుసంధానించి పనులు పూర్తి చేశారు. ఇన్నర్ రింగ్‌రోడ్డు ఫేజ్-1 రోడ్డు క్రాసింగ్ పనులు కూడా పూర్తి చేశారు. పైప్‌లైన్ అలైన్‌మెంట్‌లో భాగంగా పందులకాలనీ, గడ్డిపాడులో స్థల సేకరణ చేసి 1.2 కిలోమీటర్ల మేర ఆగిపోయిన పనులను పునరుద్ధరించి పూర్తి చేశారు. దీంతో తక్కెళ్లపాడులోని టిడ్కో ఇళ్ల కోసం కావాల్సిన 1.672 ఎంఎల్‌డీ నీటిని అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ నెల 13 నుంచి మంచినీటి సరఫరా ప్రారంభించారు. ఈ పనుల కోసం రూ.11 కోట్లు ఖర్చు చేశారు. టిడ్కో ఇళ్లకు రంగులు వేసే పని ప్రారంభం అయ్యింది. బయట రంగులు వేయడం పూర్తి కాగా, లోపల గోడలకు పెయింటింగ్ పని ప్రారంభం కావాల్సి ఉంది. రూ.17.2 కోట్ల వ్యయంతో మౌలిక సదుపాయాలు కల్పించే పని జరుగుతోంది. ఇప్పటికి రూ.15.07 కోట్లు ఖర్చు చేశారు. విద్యుద్ధీకరణ పనుల కోసం ఏపీఎస్‌పీడీసీఎల్‌కి రూ.14.8 కోట్లు చెల్లించారు. ఇందులో 95 శాతం పనులు పూర్తి అయ్యాయి. పచ్చదనం, పార్కుల అభివృద్ధి కోసం రూ.కోటి చెల్లించారు. త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి. టిడ్కో గృహాలకు సంబంధించి సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ కోసం రూ.5.93 కోట్లు ఖర్చు చేశారు.

> **త్వరలో అందుబాటులోకి ...**
>
> అడవితక్కెళ్లపాడులో నిర్మిస్తున్న 4192 టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందుబాటులోకి తీసుకువస్తున్నారు. మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి అన్ని పనులు పూర్తి అవుతున్నాయి. ఇప్పటివరకూ సమస్యగా ఉన్న మంచినీటి సరఫరా అడ్డంకులను రైల్వే, ఆర్అండ్‌బీ అధికారుల సహకారంతో అధిగమించాం.
>
> – కీర్తి చేకూరి, మున్సిపల్ కమిషనర్



మంచినీటి సరఫరా కోసం చేస్తున్న పనులు

భక్తుల సౌకర్యాలకు పెద్ద పీట

- మహా మండపం వద్ద మరో పొంగలి షెడ్డు
- ఆలయ పరిసరాల్లో 10 బయో టాయిలెట్స్
- దుర్గగుడి పాలక మండలి సమావేశంలో పలు నిర్ణయాలు



పాలక మండలి నిర్ణయాలను మీడియాకు వివరిస్తున్న దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): అమ్మవారి దర్శనానికి విచ్చేసే భక్తులకు అవసరమైన అన్ని సదుపాయాలను కల్పించడమే లక్ష్యంగా పాలక మండలి అడుగులు వేస్తోందని దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు అన్నారు. బ్రాహ్మణ వీధిలోని జమ్మిదొడ్డి ఆవరణలోని బోర్డు మీటింగ్ హాల్‌లో గురువారం పాలక మండలి సమావేశం నిర్వహించారు. చైర్మన్ కర్నాటి రాంబాబు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఈవో భ్రమరాంబ, ఈఈలు కోటేశ్వరరావు, ఎల్. రమాలతో పాటు ఏఈవోలు, సూపరింటెండెంట్లు, పాలక మండలి సభ్యులు హాజరయ్యారు. గురువారం ఉదయం 12 గంటలకు ప్రారంభమైన సమావేశం మొత్తం 6 అంశాలతో పాటు గత రెండు పాలక మండలి సమావేశాలలో ఆమోదం పొందిన అంశాల పనుల పురోగతిపై చర్చించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో చైర్మన్ కర్నాటి రాంబాబు పాలక మండలి సమావేశంలో చర్చించిన అంశాలపై మీడియాతో మాట్లాడారు.

ఇంజినీరింగ్ పనులపైనే..

దేవస్థానంలో జరుగుతున్న ఇంజినీరింగ్ పనులపై ప్రధానంగా చర్చ జరిగిందని చైర్మన్ కర్నాటి చెప్పారు. రూ. 13 కోట్లతో ఏర్పాటు చేస్తున్న క్యూలైన్ పనులకు టెండర్లు ఆహ్వానించామన్నారు. అన్నదానం, ప్రసాదాల పోటు నిర్మాణ పనులపై కూడా చర్చించామన్నారు. సకల జనులు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ మే 12వ తేదీ నుంచి 17వ తేదీ వరకు నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించే యాగానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను ఈవో భ్రమరాంబ పర్యవేక్షణలో సకాలంలో పూర్తయ్యేలా పాలక మండలి తమ వంతు సహకారం అందిస్తుందన్నారు. సమావేశంలో పాలక మండలి సభ్యులు బుద్ధా రాంబాబు, కట్టా సత్తెయ్య, దేవిశెట్టి బాలకృష్ణ, చింతా సింహాచలం, కేసరి నాగమణి, నంబూరి రవి, చింకా శ్రీనివాసరావు, కొలుకులూరి రామసీత, అల్లూరి కృష్ణవేణి, తొట్టడి వేదకుమారి, అనుమోలు ఉదయలక్ష్మి, నిడమానూరు కల్యాణ్ పాల్గొన్నారు.

చర్చకు వచ్చిన ప్రధానాంశాలు..


- భక్తుల సౌకర్యార్థం కొండ దిగువన కెనరా బ్యాంక్ ఏటీఎం మిషన్ ఏర్పాటుపై పాలక మండలి ఆమోదం తెలిపింది.
- వేసవిలో పెరుగుతున్న ఎండల దృష్టిలో పెట్టుకుని భక్తుందరికీ దేవస్థానం మజ్జిగ పంపిణీ చేయాలని నిర్ణయించింది.
- ప్రతి రోజు రాత్రి ఆలయ ప్రాంగణంలో నిద్ర చేసే భక్తుల కోసం వంద మందికి అన్న ప్రసాదం పంపిణీ చేయాలని పాలక మండలి నిర్ణయం తీసుకుంది.
- ఆలయాభివృద్ధికి భక్తులు సూచనలు, సలహాలు అందజేసేందుకు మే నుంచి భక్తజన దర్బార్ నిర్వహించాలని తీర్మానించారు. ప్రతి నెల రెండో గురువారం మహా మండపం ఆరో అంతస్తులో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. చైర్మన్‌తో పాటు ఈవో భక్తులకు అందుబాటులో ఉంటారు.
- అమ్మవారి అన్నదానం, ఇతర పథకాలకు విరాళాలు అందజేసిన భక్తులకు ఇకపై నెలకోసారి అంతరాలయ దర్శనానికి అనుమతించాలని మండలి నిర్ణయించింది.

అంతరాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

ఒంగోలు టౌన్: వరుస చోరీలకు పాల్పడుతున్న అంతరాష్ట్ర ముఠాను ప్రకాశం జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.7 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం ఎస్పీ మలికా గర్గ్ వివరాలను వెల్లడించారు. గత ఏడాది డిసెంబర్‌లో నగరంలోని భాగ్యనగర్ 3వ లైనులో బాలిన శ్రీమన్నారాయణ కుటుంబసభ్యులు ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లారు. తాళాలను పగులగొట్టి లోపలికి ప్రవేశించిన దుండగులు 5 కేజీల వెండి వస్తువులు, 64 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.20 వేల నగదు, ఫోను దొంగలించారు. అలాగే నవంబర్‌లో రాజీవ్‌నగర్ ఎక్స్‌టెన్షన్‌లో పర్వతం అనుపల్లవి ఇంట్లోకి ప్రవేశించిన దొంగలు బంగారు ఆభరణాలు, రెండు ల్యాప్‌టాప్‌లను చోరీ చేశారు. అదే నెలలో బాపట్ల నగరంలోని ఎస్ఎస్‌వీ అగ్రహారంలో సోమరౌతు వెంకట తులసి ఇంటి కిటికీ గ్రిల్స్ తొలగించి లోపలికి ప్రవేశించిన దొంగలు వెండి వస్తువులను దోచుకుని వెళ్లారు. తాళాలు వేసి ఉన్న ఇళ్లలో వరస చోరీలు జరుగుతుండడంతో సీరియస్‌గా తీసుకున్న ఎస్పీ మలికాగర్గ్ ఒంగోలు డీఎస్పీ యు.నాగరాజు ఆధ్వర్యంలో ఒక టీంను నియమించారు. తమదైన శైలిలో దర్యాప్తు చేసిన పోలీసుల ప్రత్యేక టీం రాజమండ్రికి చెందిన చొల్లంగి సురేష్, గుంటూరుకు చెందిన మర్రి రవికుమార్, కువ్వారపు అజయ్‌లతో కలిసి దొంగతనాలకు పాల్పడుతున్నట్లు సమాచారాన్ని సేకరించారు. గురువారం ఒంగోలు గాంధీరోడ్డులో ఇందిరా గాంధీ విగ్రహం వద్ద ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. చొల్లంగి సురేష్‌పై ఇప్పటికే 26 కేసులు ఉండగా, రవికుమార్ 15 కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. వీరు ఒక ముఠాగా ఏర్పడి వైజాగ్, విజయవాడ, గుంటూరు, హైదరాబాద్, మంగళగిరి ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడుతున్నారు. వీరి వద్ద నుంచి వెండి, బంగారం, ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం సొత్తు విలువ రూ.7.70 లక్షలు ఉంటుందని ఎస్పీ తెలిపారు.

ఆదర్శనీయుడు భగీరథుడు

కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి



భగీరథ మహర్షి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్, జేసీ

గుంటూరు వెస్ట్: లక్ష్యసాధనకు మారుపేరుగా నిలిచే భగీరథ మహర్షి చేసిన ప్రయత్నం సమాజానికి ఇప్పటికీ ఆదర్శంగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. భగీరథ మహర్షి జయంతిని పురస్కరించుకుని గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ భగీరథ జయంతిని ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. సమాజం కోసం, ధర్మం కోసం మహనీయులు చేసిన త్యాగాలను ఎప్పటికీ గుర్తుంటాయన్నారు. గంగా జలాలను దివి నుంచి భువిపైకి తీసుకొచ్చే క్రమంలో మహర్షి చేసిన తపస్సు నేటి యువతరానికి స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ శివన్నారాయణ శర్మ, డీఆర్ఓ చంద్రశేఖరరావు, డిప్యూటీ కలెక్టర్ వెంకట శివరామిరెడ్డి, గుంటూరు ఆర్డీఓ ప్రభాకర రెడ్డి, నగర కార్పొరేషన్ డైరెక్టర్ నారాయణమ్మ, బీసీ సంఘాల ప్రతినిధులు వెంకయ్య, ఇమ్మడి, వెంకట్రావు, ధూపాటి రామకోటేశ్వరరావు, కఠారి వెంకటేశ్వరరావు, జిల్లా అధికారులు భగీరథునికి ఘన నివాళులర్పించారు.

బల్లికురవ ఎంఈఓపై చర్యలు తీసుకోవాలి



ఆర్జేడీ సుబ్బారావుకు వినతి పత్రం సమర్పిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు, యూటీఎఫ్ నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులను మానసికంగా వేధింపులకు గురి చేయడంతో పాటు అవినీతికి పాల్పడుతున్న బాపట్ల జిల్లా బల్లికురవ ఎంఈఓపై చర్యలు తీసుకోవాలని ఆర్జేడీ వీఎస్ సుబ్బారావుకు ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు విజ్ఞప్తి చేశారు. గురువారం గుంటూరు కలెక్టరేట్ వద్ద ఉన్న ఆర్జేడీ కార్యాలయంలో సుబ్బారావును కలిసి వినతి పత్రం సమర్పించారు. ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ ఎంఈఓ బండ్ల వీర రాఘవయ్య ఉపాధ్యాయులపై వేధింపులకు పాల్పడటంతో పాటు ఆర్థిక అవకతవకలకు పాల్పడ్డారని, తక్షణమే సంబంధిత ఎంఈఓపై విచారణ జరిపి సస్పెండ్ చేయాలని కోరారు. ఆర్జేడీని కలిసిన వారిలో యూటీఎఫ్ బాపట్ల జిల్లా అధ్యక్షుడు వినయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఏ. శ్రీనివాసరావు, కోశాధికారి వెంకటేశ్వరరెడ్డి, మండల నాయకులు ఉన్నారు.

పేదల ఆర్థికాభివృద్ధే సీఎం జగన్ ధ్యేయం

- రాజ్యసభసభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి
- గుంటూరులోని కార్పొరేటర్లతో సమావేశం
- జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంపై సమీక్ష



గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని కార్పొరేటర్లతో సమావేశమైన రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి

పట్నంబజారు(గుంటూరు): పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి చెప్పారు. గుంటూరు బృందావన్‌గార్డెన్స్‌లోని వైఎస్సార్‌సీపీ రీజినల్ కార్యాలయంలో గురువారం గుంటూరు తూర్పు నియోజకవర్గ కార్పొరేటర్లతో సమావేశమయ్యారు. ముందుగా నియోజకవర్గంలో జరుగుతున్న జగనన్నే మా భవిష్యత్తు - మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరించాలని సూచించారు. రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్ ముందుకు సాగుతున్నారన్నారు. కుల, మత, ప్రాంత, రాజకీయ భేదం చూపకుండా సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ముందుకు సాగుతున్నారన్నారు. ఈనేపథ్యంలో గత నాలుగేళ్లల్లో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు, ప్రతి కుటుంబానికి నేరుగా అందిన సంక్షేమం గురించి వివరిస్తూ రాష్ట్ర ప్రభుత్వంపై వారికి ఉన్న నమ్మకాన్ని తెలియజేసేలా ఇచ్చిన దరఖాస్తులను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్లు వనమా బాలవజ్రబాబు, షేక్ సజీల, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ మహిళ నేత షేక్ నూరిఫాతిమా, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ పేలి ఐదుగురికి గాయాలు



నాదెండ్ల: సాతులూరు గ్రామంలోని చందవరం సెంటర్‌లో వంట గ్యాస్ సిలిండర్ పేలి ఐదుగురు గాయాలపాలైన సంఘటన గురువారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు శ్రీ చౌత్రాబేకర్స్‌లో మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో బేకరికి సంబంధించిన వంట పనులు జరుగుతుండగా గ్యాస్ లీకై సిలిండర్ పేలింది. దీంతో బేకరి పైభాగంలోని రేకులు సైతం ఒక్కసారిగా గాల్లోకి ఎగిరాయి. బేకరిలో పనిచేస్తున్న కన్నెబోయిన అజయ్, మొగిలి మల్లేశ్వరి, మత్రి సాంబశివరావు గాయాలపాలయ్యారు. బేకరిలో కొనుగోలు చేసేందుకు వచ్చిన షేక్ రఫీ, రసూల్ గాయాలపాలయ్యారు. వీరిని స్థానిక ప్రైవేటు వైద్యశాలలో ప్రాథమిక చికిత్స అనంతరం నరసరావుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

దాంపత్య బంధం ఔన్నత్యాన్ని చాటిన నాటికలు



'ఐదు పదులు' నాటికలో దృశ్యం



'మనసున మనసై' నాటికలో సన్నివేశం



ఆనందమానందమాయే నాటికలో సన్నివేశం

తెనాలి: డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి నాటక కళాపరిషత్ జాతీయస్థాయి ద్వితీయ ఆహ్వాన నాటికల పోటీల్లో రెండోరోజైన గురువారం ప్రదర్శించిన నాటికలు దాంపత్య బంధం ఔన్నత్యాన్ని చాటాయి. స్థానిక తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో జరుగుతున్న నాటికల పోటీలు జరుగుతున్న విషయం తెలిసిందే. తొలి ప్రదర్శనగా హేలాపురి కల్చరల్ అసోసియేషన్, ఏలూరు వారి 'మనసున మనసై' నాటికను ప్రదర్శించారు. 'మన పిల్లలతో అమ్మానాన్నలను ఆడుకోనిద్దాం.. వాళ్లు ఆనంద పడతారు. మన అవసరాల కోసం అమ్మానాన్నలను వాడుకోవద్దు' అంటూ బిడ్డలకు హితోక్తి పలికిందీ నాటిక. అమెరికాలో ఉద్యోగం చేస్తున్న కొడుకు, తనకు సంతానం కలిగాక మనుమడి ఆలనా పాలనా చూసేందుకని తల్లిని మాత్రమే తీసుకెళతాడు. ఆయాగా, పనిమనిషిగా తల్లిని వాడుకుంటారు. సొంతూర్లో తండ్రి ఒక్కడే ఒంటరితనాన్ని అనుభవిస్తూ కుంగిపోతుంటాడు. చివరకు అమెరికాలోనే గుండెపోటుతో చనిపోయిన తల్లి అస్థికలను తీసుకొచ్చి తండ్రికి అప్పగిస్తాడు కొడుకు. తల్లిదండ్రులు వృద్ధాప్యంలో వున్నపుడు ఒకరినుంచి మరొకరిని విడదీయొద్దు...కుంగిపోతారు. శరీరాలు వేరైనా మనస్సు ఒక్కటే, మానసిక స్థితి ఒక్కటేనని చాటిందీ నాటిక. ప్రధాన పాత్రల్లో పి.విజయకుమార్, వైకే భవాని, వై.ప్రణీత్, శీరం శ్రీనివాసరావు నటించారు. చింతల మల్లేశ్వర రావు, పి.కృష్ణహితేష్ రచనకు మహ్మద్ ఖాజావలి దర్శకత్వం వహించారు.

అనంతరం అమరావతి ఆర్ట్స్-గుంటూరు వారి ఐదు పదులు నాటికను ప్రదర్శించారు. ఇదికూడా దాంపత్య బంధం పవిత్రతకు అద్దంపట్టింది. ఆస్తిపాస్తులు లేకున్నా అన్యోన్యంగా జీవిస్తుంటుంది ఓ వృద్ధ జంట. అయిదు పదుల వైవాహిక జీవితాన్ని పండగ చేసుకోవాలని ఏర్పాట్లు చేస్తాడు భర్త. క్యాన్సరు వ్యాధితో బాధపడుతున్న ఆ ఇల్లాలు అంతకు ఒకరోజుముందే కన్నుమూస్తుంది. అయినా తన ప్రాణానికి ప్రాణమైన భార్య, పండగరోజు తనతోనే ఉండాలనే భావనతో చనిపోయిన ఆమెకు పట్టుచీర కట్టి, చేతులనిండా గాజులు తొడిగి, ఇంట్లోనే ఉంచుకుంటాడు భర్త. నాటికాన్ని రచించి దర్శకత్వం వహించిన కావూరి సత్యనారాయణ ప్రధాన పాత్రలో నటించారు. ఇతర పాత్రల్లో టి.లక్ష్మి, ఎస్ఏస్‌ఆర్‌ఏ ప్రసాద్, హసన్, బీవీఎస్ ప్రసాద్ నటించారు. సంగీతం రాజభూషణం.

చివరగా నడింపల్లి వెంకట సుబ్బారావు మెమోరియల్, సాతులూరి వారి 'ఆనందమా నందమాయే' నాటికను ప్రదర్శించారు. దంపతులు సమస్య మూలాలను గ్రహించి పరిష్కార దిశగా ప్రయత్నిస్తే భార్యాభర్తల మధ్య ప్రేమ, అనురాగం, ఆప్యాయతలతో వారి జీవితం ఆనందమయంగా సాగుతుందనేది సందేశం. ఎంవై శ్రీదేవి రచనను నడింపల్లి వెంకటేశ్వరరావు దర్శకత్వంలో ప్రదర్శించారు. కళాపరిషత్ నిర్వాహకులు అద్దేపల్లి లక్ష్మణశాస్త్రి, ఆరాధ్యుల కన్నా, పిట్టు కోటేశ్వరరావు, కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి గరికపాటి సుబ్బారావు, దేవిశెట్టి కృష్ణారావు పర్యవేక్షించారు.

సీఎం హామీ ఇచ్చిన అభివృద్ధి పనులకు అధిక ప్రాధాన్యమిద్దాం

కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి

గుంటూరు వెస్ట్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చిన అభివృద్ధి పనులకు అధిక ప్రాధాన్యం ఇచ్చి త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి సూచించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ శివన్నారాయణ శర్మ, డీఆర్వో చంద్రశేఖరరావుతో కలిసి నిర్వహించిన అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్తిపాడు నియోజకవర్గంలో ప్రధాన రహదారి, పెదనందిపాడులో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం, ప్రధాన రహదారి, విస్తరణ పనులు వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పెదనందిపాడులో పీహెచ్‌సీ నిర్మాణం, క్రీడా వికాస కేంద్రానికి నిధులు మంజూరయ్యాయని, నెలాఖరుకు టెండర్ ప్రక్రియ పూర్తి చేయాలని చెప్పారు. గుంటూరు సిటీలో యూజీడీ పెండింగ్ పనులు పూర్తి చేయాలని చెప్పారు. శంకర్ విలాస్ ఫ్లైఓవర్ విస్తరణ, నిర్మాణ పనులను అధికారులు సమన్వయంతో ముందుకు తీసుకెళ్ళాలని చెప్పారు. ముస్లిం కమ్యూనిటీ హాల్, లైబ్రరీ నిర్మాణానికి వెంటనే టెండర్ ప్రక్రియ పూర్తి చేయాలని చెప్పారు. తెనాలిలో క్రిస్టియన్ శ్మశాన వాటికకు భూమిని సేకరించాలన్నారు. బుర్రిపాలెంలో షాదీఖానా నిర్మాణానికి గుర్తించిన భూములను వెంటనే సేకరించాలన్నారు. కొల్లిపరలో మినీ వ్యవసాయ మార్కెట్, యార్డు నిర్మాణానికి భూములు సేకరించి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ భవనం నిర్మాణానికి గుర్తించిన దేవదాయ శాఖ భూముల లీజు పద్ధతిపై కేటాయింపునకు ఎంటీఎంసీ, అధికారుల సమన్వయంతో ముందుకు వెళ్లాలన్నారు. పొన్నూరులో ఆటోనగర్ ఏర్పాటుకు, తెనాలిలో దాల్ మిల్ క్లస్టర్, మంగళగిరిలో చేనేత క్లస్టర్ ఏర్పాటుకు ఏపీఐఐసీ, పరిశ్రమల శాఖ అధికారుల సమన్వయంతో చర్యలు చేపట్టాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పనుల వేగం పెంచాలని కలెక్టర్ వివరించారు. సమావేశంలో డెప్యూటీ కలెక్టర్ వెంకట శివరామిరెడ్డి, గుంటూరు డీఆర్వో ప్రభాకర రెడ్డి, ఏఎస్పీ శ్రీనివాసరావు, పంచాయితీ రాజ్ ఎస్ఈ బ్రహ్మయ్య, స్టెప్ సీఈఓ పల్లవి, దేవదాయ శాఖ డీసీ మహేశ్వరరెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బాపట్లలో త్వరలో కమ్యూనికేషన్ టవర్స్ ఏర్పాటు

సౌత్ రీజియన్ కమ్యూనికేషన్ వింగ్ ఎస్పీ జె.రాజశ్రీ



ఎస్పీ వకుల్‌జిందాల్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సౌత్ రీజియన్ కమ్యూనికేషన్ వింగ్ ఎస్పీ జె.రాజశ్రీ

బాపట్లటౌన్: బాపట్లలో త్వరలో కమ్యూనికేషన్ టవర్స్‌ను ఏర్పాటు చేయనున్నట్లు సౌత్ రీజియన్ కమ్యూనికేషన్ వింగ్ ఎస్పీ జె.రాజశ్రీ తెలిపారు. బాపట్ల జిల్లా కమ్యూనికేషన్ వింగ్‌ను రెండు రోజుల పాటు వార్షిక తనిఖీ నిర్వహించడానికి గురువారం బాపట్లకు చేరుకున్నారు. తొలుత ఎస్పీ వకుల్ జిందాల్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం నూతనంగా ఏర్పడిన బాపట్ల జిల్లాలోని పోలీస్‌స్టేషన్‌లకు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం నుంచి సమాచారాన్ని అందించడానికి, స్వీకరించడానికి అవసరమైన కమ్యూనికేషన్‌కు సంబంధించిన టవర్స్ ఏర్పాటు గురించి, నెట్ వర్క్ విస్తరణకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.

బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షునిగా మురళి



బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మురళిని అభినందిస్తున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన

నరసరావుపేటరూరల్: ఏపీ బీసీ సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షునిగా యామా మురళీ ఎన్నికయ్యారు. వినుకొండరోడ్డులోని రోటరీ క్లబ్ కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం బీసీ సంక్షేమ సంఘం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి బాదుగున్నల శ్రీను అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు హాజరయ్యారు. సమావేశంలో జిల్లా అధ్యక్షునిగా మురళీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, మండల అధ్యక్షుడు నాగారపు గురుఆంజనేయులు, సరికొండ తిమ్మరాజు, గాలి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

గుణాత్మక విద్యను బోధించాలి



వార్షికోత్సవంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్‌బీజీ పార్థసారథి

- మార్కులే పరమార్థం కారాదు
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్‌బీజీ పార్థసారథి



విద్యార్థినుల సంప్రదాయ నృత్య ప్రదర్శన

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యాసంస్థలు మార్కుల సాధనకే పరిమితం కాకుండా విద్యార్థులకు గుణాత్మక విద్యను బోధించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్‌బీజీ పార్థసారథి సూచించారు. గురువారం కలెక్టర్ బంగ్లా రోడ్డులోని భారతీయ విద్యా భవన్ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి మాట్లాడుతూ విద్యార్థుల ఆసక్తి, అభిరుచికి తగినట్టు విద్యాబోధనతో పాటు నైపుణ్యాలను వెలికితీసే చర్యలు అవసరమన్నారు. క్రమశిక్షణ పేరుతో విద్యార్థులను శిక్షించకుండా వారి మార్పు తీసుకురావాలని సూచించారు. విద్యార్థులు వ్యసనాలకు, విపరీత ధోరణులకు ఆకర్షితులు కాకుండా పర్యవేక్షించాలని చెప్పారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఉత్తమ ప్రదర్శనలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి పి.గోపాలరాజు, కోశాధికారి మాజేటి ప్రసాద్, ప్రిన్సిపాల్ హేమాంబ, ఉపాధ్యాయులు విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వన్ స్టాప్ సెంటర్ పరిశీలన



సెంట్రల్ బృందంతో వన్‌స్టాప్ సెంటర్ సిబ్బంది

గుంటూరు మెడికల్: గుంటూరు రైలుపేటలోని వన్‌స్టాప్ సెంటర్‌ను గురువారం సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ (సీడీసీ) బృందం పరిశీలించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి సహకారంతో వలంటరీ హెల్త్ సర్వీసెస్ ఆధ్వర్యంలో ఫిమేల్ సెక్స్‌వర్కర్స్‌కు, హై రిస్క్ పాపులేషన్‌కు ఆరోగ్య, సామాజిక, న్యాయ సేవలు ఈ సెంటర్ అందిస్తోంది. వన్‌స్టాప్ సెంటర్‌లో ఎలాంటి సేవలు అందిస్తున్నారు, వాటిని ఎలా వినియోగించుకుంటున్నారు, ఎంత వరకు లాభపడుతున్నారు, అనే విషయాలను అక్కడ సేవలు పొందుతున్నవారిని బృంద సభ్యులు అడిగి తెలుసుకున్నారు. హెచ్ఐవీ సమాచారం మరింతగా తెలుసుకునేలా ఐదు రకాల పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీడీసీ హెడ్‌క్వార్టర్‌కు చెందిన డాక్టర్ హన్నాడిమేకి (అట్లాంట), డాక్టర్ తరుణ్, డాక్టర్ సుధీర్, వలంటీరి హెల్త్ సర్వీసెస్ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ విలియమ్స్ జోసఫ్, డాక్టర్ విజయరామన్, డాక్టర్ సంపత్, అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ బండారు సుబ్బారావు, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి డిస్ట్రిక్ట్ ప్రాజెక్టు మేనేజర్ లంకపల్లి మధుసూధనరావు, జిల్లా సూపర్‌వైజర్ జ్యోతుల వీరాస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో శ్రీమేధ విద్యార్థుల విజయకేతనం



సీనియర్ ఎంఈసీలో 980 మార్కులు సాధించిన వరలక్ష్మిని అభినందిస్తున్న నందకిషోర్

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ ఫలితాల్లో శ్రీమేధ విద్యాసంస్థల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని సంస్థ చైర్మన్ అన్నా నందకిషోర్ తెలిపారు. గుంటూరులోని సంస్థ ప్రధాన క్యాంపస్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో నందకిషోర్ మాట్లాడుతూ 18 ఏళ్లుగా ఇంటర్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో టాప్ మార్కులతోపాటు అత్యధిక ఉత్తీర్ణతా శాతాన్ని సాధిస్తున్నట్లు తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంఈసీ విభాగంలో 500 మార్కులకు బీఎస్ సాయి ధీరజ్ 493, బి.రాహుల్ 485, ఎస్.కిషోర్ 483, షేక్ షాహినా 481, టి.వెంకట సేతుశివ 481, పి.మధుర వర్షిణి 480, సీఈసీ విభాగంలో జైన్ డాలీ 485 మార్కులతో ప్రతిభ చాటినట్లు పేర్కొన్నారు. సీనియర్ ఇంటర్ ఎంఈసీ విభాగంలో టి.వరలక్ష్మి 980, అన్నా సాయి వెంకట ధీరజ్ 979, షేక్ ఇర్ఫాన్ 974, ఎస్. లక్ష్మణ 973, ఎం.మోక్షిత 972, సీఈసీ విభాగంలో షేక్ కరిముల్లా 936 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఈసందర్భంగా టాపర్లను శ్రీమేధ చైర్మన్ అన్నా నందకిషోర్‌తో పాటు కార్యదర్శి అన్నా శ్రీలక్ష్మి అభినందించారు.

సిబ్బంది సమష్టి కృషితో ఆర్టీసీకి పూర్వవైభవం

- ఆర్టీసీ నెల్లూరు జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆదాంసాహెబ్
- ఉత్తమ ప్రతిభ కనబరచిన డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లకు ప్రశంసా పత్రాల బహూకరణ



డీజిల్ ఆదాచేసిన డ్రైవర్ కేకే చక్రవర్తికి ప్రశంసాపత్రం అందజేసిన ఆదాంసాహెబ్

తెనాలి: ఆర్టీసీకి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు సిబ్బంది సమష్టిగా కృషి చేయాలని ఆర్టీసీ నెల్లూరు జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.ఆదాంసాహెబ్ సూచించారు. ఆర్టీసీ బస్సులకు 75 శాతం ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) వచ్చేందుకు అందరూ ప్రయత్నించాలని కోరారు. సొంతవాహనాలు, ప్రైవేటు కాంట్రాక్ట్ క్యారేజీలు, షేర్ ఆటోలు నడుస్తున్న కాలంలో ఆర్టీసీకి గడ్డురోజులు అయినప్పటికీ ఎవరికివారు క్రమశిక్షణతో, ఫిర్యాదులు లేకుండా, సమష్టిగా పనిచేస్తే లక్ష్యాన్ని సాధించవచ్చని తెలిపారు. ఆర్టీసీ తెనాలి డిపోను గురువారం ఆయన సందర్శించి, గ్యారేజీలో సిబ్బంది సమావేశంలో మాట్లాడారు. ఆర్టీసీపరంగా నెల్లూరు జోన్‌లో 285 బస్సుల్ని ఫేస్‌లిఫ్ట్ చేయించామనీ, 185 అద్దె బస్సుల్ని తీసుకున్నామని చెప్పారు. నాన్ ఏసీ స్లీపర్లను ప్రవేశపెట్టామని, ప్రయాణీకులు అడుగుతున్న ఏసీ స్లీపర్లను తీసుకొచ్చేందుకు యాజమాన్యం ప్రయత్నిస్తోందని చెప్పారు. 2023-24 సంవత్సరానికి లక్ష్యాలను అధిగమించాలని సూచించారు. కార్గో సర్వీసుల ద్వారా ఈ ఏడాది రూ.500 కోట్లు ఆర్జించాలని కార్పొరేషను లక్ష్యంగా నిర్ణయించుకున్నట్టు చెప్పారు. తెనాలి డిపోలో ప్రస్తుతం రోజుకు రూ.35 వేలు ఆదాయం సమకూరుతోందనీ, ఈ మొత్తాన్ని రూ.75 వేలకు పెంచాలనేది లక్ష్యంగా తెలిపారు. కమర్షియల్ దుకాణాలతో ఆర్టీసీకి ఏటా రూ.150 కోట్లు సమకూరుతోందనీ, దీనిని రూ.200 కోట్లకు పెంచాల్సి ఉందన్నారు. ప్రయాణీకుల ఆదరణ ఉంటేనే రూట్లు పెరుగుతాయనీ, తద్వారా సిబ్బందిని పెంచుకోవచ్చని ఆదాం సాహెబ్ గుర్తుచేశారు. ఇందుకు సమయపాలన పాటించటం, వ్యక్తిగత క్రమశిక్షణను పాటించటం ముఖ్యమన్నారు. డ్రైవరు, కండక్టరు విధుల్లో ఉన్నపుడు సెల్‌ఫోన్ వాడరాదని స్పష్టంగా చెప్పారు. మద్యం తాడి విధులు నిర్వహించటం వల్ల ఉద్యోగాలు పోతాయని హెచ్చరించారు. అనధికార కార్గో ప్యాకెట్లను స్వీకరించరాదని చెప్పారు.

గుంటూరు జిల్లా పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ అధికారి విజయగీత మాట్లాడుతూ, ఫిర్యాదులు రాకుండా సర్వీసులు నడిపినట్టయితే టార్గెట్లను తేలికగా సాధించవచ్చని అభిప్రాయపడ్డారు. ప్రమాదాలకు ఆస్కారం లేకుండా బస్సులు నడపాలని డ్రైవర్లకు సూచించారు. గూడ్స్ రవాణాలోనూ ప్రజల ఆదరణ పొందగలగాలని చెప్పారు.

డీజిల్ ఆదా చేసిన డ్రైవర్లు కేకే చక్రవర్తి, డి.రమేష్‌బాబు, ఎక్కువ ఆదాయం చూపిన కండక్టర్లు జి.కల్పన, కేవీఎం లక్ష్మి, ఉత్తమ మెకానిక్‌లు షేక్ నూర్‌మస్తాన్, ఎం.ప్రసాద్‌కు ఆదాంసాహెబ్ ప్రశంసాపత్రాలను అందజేశారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఓఎస్‌డీ శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. తెనాలి డిపో మేనేజరు ఎ.రాజశేఖర్ అధ్యక్షత వహించారు.

పవర్ లిఫ్టింగ్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక



పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో కార్యదర్శి, కోచ్‌లు

మంగళగిరి: కేరళ రాష్ట్రంలోని అళప్పుజ పట్టణంలో మే నెల 1వ తేదీ నుంచి 6వ తేదీ వరకు నిర్వహించనున్న ఏషియన్ సబ్ జూనియర్, జూనియర్ మాస్టర్స్ మెన్ ఉమెన్ ఎక్యూప్డ్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్-2023 పోటీలకు భారతదేశం తరపున నలుగురు క్రీడాకారులు ఎంపికైనట్లు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి గుమ్మడి పుల్లేశ్వరరావు తెలిపారు. గురువారం నగరంలోని పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యాలయంలో వివరాలను వెల్లడించారు. సబ్ జూనియర్ 74 కిలోల పురుషుల విభాగంలో షేక్ అబ్దుల్ మతిన్, జూనియర్ మహిళల 57 కేజీల విభాగంలో షేక్ సాదియా అల్మాస్, సబ్ జూనియర్ మహిళల 84 కిలోల విభాగంలో షేక్ షబీనా, 84 ప్లస్ కేజీల విభాగంలో నాగం జ్ఞానదివ్య ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన వారిని కోచ్‌లు షేక్ సంధానీ, ఎండీ ఖమ్రుద్దీన్‌లు అభినందించినట్లు పుల్లేశ్వరరావు తెలిపారు.